సాక్షి విశాఖపట్నం

శనివారం । 8 । జూలై । 2023



బ్లూఫ్లాగ్ బీచ్‌కు ప్రణాళిక

రుషికొండ బీచ్ హంగులద్దుకునేందుకు ముస్తాబవుతోంది. రూ.2.50కోట్లతో పర్యాటక శాఖ అభివృద్ధి చేయనుంది. IIలో



నేత్రపర్వం.. నృత్యోత్సవం

నాట్యరవళి సంగీత, నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నృత్యోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. IIలో



ఏ త్యాగానికైనా సిద్ధం

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. IIలో

న్యూస్‌రీల్

ఏయూలో వైఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ నేడు



మహానేత కాంస్య విగ్రహం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శనివారం ఉదయం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ జరగనుంది. మహానేత ఆకస్మిక మరణం తరువాత 2009 సెప్టెంబర్ 19న ఏయూలో వైఎస్సార్ ఫైబర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీని స్థానంలో కొత్త కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఈ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సత్యం జంక్షన్ టు వెంకోజిపాలెం రోడ్డు విస్తరణపై కసరత్తు



రోడ్డు విస్తరణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


సీతమ్మధార: ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం మీదుగా హెచ్‌బీ కాలనీ, వెంకోజీపాలెం వరకు రోడ్డు విస్తరణకు సాధ్యాసాధ్యాలపై జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ అధికారులతో చర్చించారు. శుక్రవారం ఆయన ఈ ప్రాంతాల్లో పర్యటించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు రోడ్డు విస్తరణ పనులపై ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని అధికారులకు సూచించారు. రహదారులపై చెత్త వేయకుండా ఇంటింటికీ వచ్చే వాహనాలకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, డీఈ శ్రీనివాసరావు, టీపీవో తేజ, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏసీబీ కోర్టు న్యాయమూర్తిగా వెంకటరమణ

విశాఖ–లీగల్ : నగరంలోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా కర్నూలు జిల్లా ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్.శ్రీదేవి విశాఖలోని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తికం ఎమ్మెస్సీ కోర్టుకు బదిలీ అయ్యారు. రాష్ట్ర హైకోర్టు పరిపాలన వ్యవహారాల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విశాఖపై చెరగని సంతకం

వైఎస్సార్



సామాన్యులకు సైతం అత్యున్నత వైద్యం అందుబాటులోకి తెచ్చిన వైఎస్సార్



(డాక్టర్ వైయస్. రాజశేఖర రెడ్డి)

- మరపురాని మహానేత గురుతులు
- ఉమ్మడి విశాఖ జిల్లాకు వైఎస్సార్ హయాంలో మహర్దశ
- విశాఖ సమగ్రాభివృద్ధికి ఆనాడే అడుగులు
- నాడు వైఎస్సార్ వేసిన అభివృద్ధి బాట.. నేడు పరిపాలనా రాజధానికి పూలబాట
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నేడు

ఆయన చూపులు... సుదీర్ఘ పరిచయపు చిరునవ్వును చిందిస్తూ, అందరి వైపూ ఆత్మీయంగా ప్రసరిస్తాయి.
ఆయన చేతులు... సదా ఏదో ఇవ్వడానికే తామున్నట్టు ఓ ఆత్మీయ స్పర్శో, చల్లని దీవెనో కురిపిస్తుంటాయి.
ఆయన పాదాలు.. ఆపన్నుల్ని ఆదుకునేందుకు, బడుగుల బతుక్కి కొత్త భరోసా ఇచ్చేందుకు నిరంతరం తపిస్తుంటాయి.
ఆయన తెలుగునాట గుండె కింద ఆరని తడి.. ఏళ్లు గడిచినా మరపురాని జ్ఞాపకాల జడి...

సాక్షి, విశాఖపట్నం : మహానేత వైఎస్సార్ మానస పుత్రికగా విశాఖ నగరం ఉజ్వలంగా వెలుగొందింది. ప్రతి రంగంలోనూ ప్రగతికి బాటలు వేసి.. పల్లె, పట్టణమని తేడా లేకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో అభివృద్ధికి నాంది పలికారాయన. లెక్కలేనన్ని ప్రతిపాదనలకు కార్యరూపమిచ్చారు. అభ్యున్నతికి ఆలంబనగా సాగిన వైఎస్సార్ పాలనలో విశాఖ.. సరికొత్తగా ఆవిష్కృతమైంది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యపు కోరల్లో పాలన సాగించడంతో.. ప్రగతి గతి తప్పి.. విశాఖ వైభవానికి చెదలు పట్టాయి. ముఖ్యమంత్రిగా 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. విశాఖ నగరం విశ్వనగరంగా దూసుకుపోతోంది. త్వరలో పరిపాలనా రాజధాని కానుంది. శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా రాజన్న చేపట్టిన అభివృద్ధి.. సంక్షేమాలను గుర్తు చేసుకుందాం.

దేశంలోని టాప్ నగరాల్లో ఒకటిగా..

దేశంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం అమలైన 63 నగరాల్లో వైజాగ్‌ను చేర్చిన ఘనత వైఎస్సార్‌దే. జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం (జెఎన్ఎన్‌యూఆర్ఎం)లో విశాఖ నగరాన్ని చేర్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన చొరవతో నగరానికి రూ.1,885 కోట్ల విలువైన పనులు దక్కాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా 20 శాతం కూడా ఎప్పటికప్పుడు జీవీఎంసీకి అందజేసేలా చర్యలు తీసుకున్నారు. సింహాచలం, పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్, విలీన గ్రామాలకు తాగునీటి సౌకర్యంతోపాటు భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన 20 ప్రాజెక్టులను వైఎస్సార్ తీసుకొచ్చారు. సెంట్రల్ సిటీలో రూ.244 కోట్లతో 750 కి.మీ మేర యూజీడీ పనులు చేపట్టారు.

యువతకు ఉపాధి... భవితకు పునాది

2008 జనవరి 2వ తేదీన ఉపాధి పథకాన్ని వైఎస్సార్ ప్రారంభించారు. రూ.5 కోట్లను కేటాయిస్తూ 18–35 ఏళ్ల మధ్య వయసున్న యువతకు 13 అంశాల్లో శిక్షణ ఇచ్చి, ఆ శిక్షణ సంస్థల ద్వారానే 70 శాతం వరకూ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ గార్డ్స్, సర్ఫేస్ ఆర్నమెంట్స్.. మొదలైన అంశాల్లో శిక్షణ తీసుకొని ఉపాధి పొందిన వారెందరో ఉన్నారు. ఆయన మరణించిన తర్వాత ఈ పథకాన్ని పూర్తిగా విస్మరించేశారు. మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలలకే.. సచివాలయ వ్యవస్థను రూపొందించి 4 లక్షలకు పైగా ఉద్యోగాలను అందించారు.

అంతర్జాతీయ హోదా ఆయన ఘనతే...

హైదరాబాద్‌కే పరిమితమైన అంతర్జాతీయ విమానాశ్రయ సర్వీసులను విశాఖ ప్రజలకూ పరిచయం చెయ్యాలని వైఎస్సార్ సంకల్పించారు. అనుకున్నదే తడవుగా రూ.100 కోట్లు వెచ్చించి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తీసుకొచ్చారు. టీడీపీ హయాంలో విమానయాన సంస్థలకు అందించాల్సిన రాయితీలు చెల్లించకపోవడంతో అనేక సర్వీసులు నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మళ్లీ సర్వీసులు మొదలయ్యాయి. అంతే కాకుండా మొదటి సారిగా.. విశాఖ నుంచి సరకు రవాణా కోసం కార్గో సర్వీసు కూడా ప్రారంభమైంది. ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన కూడా చేశారు.

గోడు చెప్పిన వారందరికీ గూడు..

మహా నగరంలో పర్యటించిన ప్రతిసారీ.. నిరుపేదలను చూసి చలించిపోయిన వైఎస్సార్.. వారికో గూడు కల్పించాలని నిర్ణయించుకున్నారు. రాజీవ్ గృహకల్ప ఇళ్లకు శ్రీకారం చుట్టారు. విశాఖ నగర పరిధిలో సుమారు లక్షకుపైగా పునరావాస, పూర్ సెటిల్‌మెంట్ కాలనీలు నిర్మించారు. రాజీవ్ గృహకల్ప ద్వారా రూ.650 కోట్లతో 15,320 ఇళ్లు, జేఎన్ఎన్‌యూఆర్ఎం ద్వారా 600 కోట్లతో 15 వేల గృహాలు, వాంబే కింద రూ.400 కోట్లతో 9 వేల ఇళ్ల నిర్మించారు. మధురవాడలో గృహ సముదాయాలు ఆయన చేతుల మీదుగానే ప్రారంభమయ్యాయి.

గ్రేటర్ హోదా కల్పించి..

ఏళ్ల తరబడి వాయిదాలు పడిన మహా విశాఖ ప్రతిపాదనలు వైఎస్సార్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫలించాయి. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2005 నవంబర్ 22న జీవీఎంసీకి గ్రేటర్ హోదా కల్పించారు. అప్పటి వరకూ 111 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉన్న విశాఖ 540 చ.కి.మీ విస్తీర్ణంతో మహా విశాఖగా అవతరించింది. 2013లో భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలని విలీనం చేయగా ప్రస్తుతం 681.96 చ.కి.మీ.లకు విస్తరించింది. 72 వార్డులతో ఉన్న జీవీఎంసీని విస్తరిస్తూ 81 వార్డులు ఏర్పాటు చేస్తామంటూ టీడీపీ ప్రభుత్వం హడావుడి చేసి విస్మరించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. జీవీఎంసీ వార్డుల విస్తరణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించారు. మరో 10 పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేస్తూ.. ప్రస్తుతం 98 వార్డులుగా మార్చారు.

విశాఖ ఐటీకి జీవం..

ఐటీ ప్రగతి ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాకుండా వికేంద్రీకరణ జరగాలని వైఎస్సార్ భావించారు. విశాఖలో ఐటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. విశాఖలో మూడు కొండల్ని, కొండల కింద ఉన్న సుమారు 100 ఎకరాల పల్లపు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. కనీసం 100 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే ఐటీ కంపెనీలకు మాత్రమే అవకాశమిచ్చి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ప్లాట్లుగా డివైడ్ చేసి అందించారు. వైఎస్ ఆలోచనలను మెచ్చి సుమారు 200 కంపెనీలు ముందుకొచ్చాయి. ఇందులో కొద్ది కాలంలోనే 70 శాతం కంపెనీలు కార్యకలాపాల్ని ప్రారంభించాయి. సత్యం, విప్రో కంపెనీలూ విశాఖలోనూ శాఖలను విస్తరించాయి. వైఎస్సార్ మరణం తర్వాత.. ఆయనతోపాటే ఐటీ గ్రాఫ్ కూడా కనుమరుగైపోయింది. ఎగుమతులు పడిపోయాయి. టీడీపీ హయాంలో ఒక్కొక్క కంపెనీ వెనక్కు వెళ్లిపోయాయి. దాదాపు పదేళ్లు విశాఖ ప్ర'గతి' తప్పింది. మళ్లీ 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నుంచి



ఐటీ రంగం పరుగులు పెడుతోంది. విశాఖ నగరంలో ఇన్ఫోసిస్ కార్యకాలపాలకు సిద్ధమైంది. డేటా ఆదాని సెంటర్ శంకుస్థాపన జరిగింది. దీంతో విశాఖ ఐటీ కళ సంతరించుకుంది.

విమ్స్ ఆయన చలవే..

ఉత్తరాంధ్ర ప్రజలకు హైదరాబాద్ నిమ్స్ తరహాలో అత్యుత్తమ సేవలు అందించేందుకు విమ్స్‌కు 2006లో వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. 1,130 పడకలు, 21 సూపర్ సెషాలిటీ బ్లాకులతో రూ.250 కోట్లతో విమ్స్ ఆస్పత్రికి 2007లో శంకుస్థాపన చేశారు. 2009 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలనుకున్నారు. వైఎస్సార్ మృతిచెందాక విమ్స్‌ని ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. చంద్రబాబు ప్రభుత్వం



విమ్స్‌ని ప్రైవేట్ పరం చేసేందుకు కుయుక్తులు పన్నింది. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంది. గతంలో కోవిడ్ సమయంలో విమ్స్‌ని స్టేట్ కోవిడ్ హాస్పిటల్‌గా మార్చింది. ప్రస్తుతం అటు విమ్స్, ఇటు కేజీహెచ్ రోగులకు అత్యుత్తమ సేవలందిస్తున్నాయి.

కేజీహెచ్‌లో గుండె శస్త్ర చికిత్సలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో మళ్లీ గుండె శస్త్ర చికిత్స(ఓపెన్ హార్ట్ సర్జరీ)లు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుండె శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య పరికరం ఈ ఏడాది మార్చి 24న మరమ్మతులకు గురికావడంతో అప్పటి నుంచి సర్జరీలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షలతో కొత్త పరికరం కొనుగోలు చేసి కేజీహెచ్‌కు అందించింది. ఆస్పత్రి కార్డియాలజీ విభాగం రెండో అంతస్తులోని కార్డియోథొరాసిక్ విభాగంలో ఈ పరికరం అమర్చారు. శనివారం ట్రయల్ రన్ వేసి, సోమవారం నుంచి శస్త్ర చికిత్సలు పునఃప్రారంభిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు.

కేజీహెచ్‌లో కార్డియాలజీ విభాగం రెండో అంతస్తులో 2015లో కార్డియోథొరాసిక్ విభాగాన్ని ఏర్పాటు చేసి వైద్యులను నియమించారు. నాటి నుంచి ఈ ఏడాది మార్చి 23వ తేదీ వరకు సుమారు 1,500 వరకు ఓపెన్ హార్ట్ సర్జరీలు చేశారు. ఈ ఏడాది మార్చి 24న మిషన్ మరమ్మతులు కావడంతో శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కార్డియోథొరాసిక్ వార్డులో ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి శస్త్రచికిత్సలు మాత్రమే చేస్తున్నారు. కార్డియాలజీ విభాగం మొదటి అంతస్తులో గుండెకు సంబంధించిన స్టంట్‌లు వేస్తున్నారు. కాగా.. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ గుండె శస్త్రచికిత్సలు ఆగిన విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పెట్టారు. ఈ నేపథ్యంలో గుండె శస్త్ర చికిత్సలకు అవసరమైన పరికరం మంజూరైంది. రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన టెంపరేచర్ కంట్రోల్ మెషీన్ ఇటీవల కేజీహెచ్‌కు చేరుకుంది. దీంతో పాటు ఇతర పరికరాలను అమర్చారు. సోమవారం నుంచి ఓపెన్ హార్ట్ సర్జరీలు చేపట్టనున్నారు. ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టడంతో పేద రోగులకు ఊరట లభించింది.



కేజీహెచ్ కార్డియాలజీ విభాగం

అన్ని చికిత్సలు ఉచితం



కేజీహెచ్‌లో గతంలో ఓపెన్ హార్ట్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించాం. జనరల్ ఫిజీషియన్ వైద్యులు, కార్డియాలజీ వైద్యులు ఎక్కువగా ఇక్కడకు కేసులు రిఫర్ చేస్తారు. ఓపెన్ హార్ట్ సర్జరీ, స్టంట్ వేసిన తర్వాత వచ్చే బ్లాక్‌లకు అవసరమైన వైద్య సేవలందిస్తున్నాం. ప్రస్తుతం ఊపిరితిత్తులకు సంబంధించి శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ కింద కేజీహెచ్‌లో అన్ని శస్త్ర చికిత్సలు ఉచితమే.

– డాక్టర్ కె.మణిత, కార్డియోథొరాసిక్ విభాగాధిపతి, కేజీహెచ్

వైఎస్సార్ కప్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం

మధురవాడ: జిల్లా స్థాయి సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ 10వ వైఎస్సార్ కప్ బాక్సింగ్ పోటీలు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ఏపీ ఎలక్ట్రానిక్ అండ్ ఐటీ ఏజెన్సీస్ జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ. వెంకటేశ్వరరావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని జిల్లా బాక్సింగ్ క్లబ్ పర్యవేక్షణలో మారుతీ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు పోటీలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 40 క్లబ్‌ల నుంచి 200మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు పిల్లా సత్యనారాయణ, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. ఆనందరావు, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ప్రకాశ్, వెంకటరావు, గోపి, బంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

మత్తు ఇంజక్షన్ల కలకలం

- బర్మాక్యాంప్‌లో కల్యాణి మెడికల్ షాప్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు
- 850 పెంటాజోసిన్ ఇంజక్షన్ల స్వాధీనం
- అహ్మదాబాద్‌లో రూ.10కి కొని రూ.250కు విక్రయిస్తున్న కల్యాణ్
- అతనితో పాటు మరో నలుగురి అరెస్ట్



మత్తు ఇంజక్షన్లను పరిశీలిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి(విశాఖ దక్షిణ): నగరంలో మత్తు ఇంజక్షన్ల విక్రయం కలకలం సృష్టించింది. అహ్మదాబాద్ నుంచి ఆన్‌లైన్‌లో మత్తు ఇంజక్షన్లు తెప్పించి నగరంలో విక్రయిస్తున్న వ్యక్తితో పాటు కొనుగోలు చేస్తున్న మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సర్జరీ సమయంలో రోగికి ఇచ్చే పెంటాజోసిన్ ఇంజక్షన్లను అనధికారికంగా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు బర్మాక్యాంప్‌లో ఉన్న కల్యాణ్ మెడికల్ షాప్‌పై దాడులు చేసి 850 ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ కేసు వివరాలను వెల్లడించారు. బర్మాక్యాంప్ ప్రాంతంలో ఉన్న కల్యాణ్ మెడికల్ షాప్‌లో పెంటాజోసిన్ ఇంజక్షన్లు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్ ఏసీపీ త్రినాథరావు, ఏసీపీ(వెస్ట్) అన్నెపు నర్సింహమూర్తి బృందాలు ఆ షాపులో తనిఖీలు నిర్వహించాయి. అందులో 850 పెంటాజోసిన్ ఇంజక్షన్లను గుర్తించారు. దీంతో షాప్ యజమాని కల్యాణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు.

అహ్మదాబాద్ నుంచి ఆన్‌లైన్‌లో..

ఈ ఇంజక్షన్లను ఎక్కడి నుంచి తెప్పించాడన్న విషయంపై పోలీసులు విచారణ చేపట్టగా విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. కల్యాణ్‌కుమార్ ఇండియామార్ట్ అనే ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్ ద్వారా అహ్మదాబాద్‌కు చెందిన హరీష్ అనే డీలర్ నుంచి 1000 ఇంజక్షన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అదీ కూడా డెల్హీవరీ.కామ్ అనే కొరియర్ ద్వారా విశాఖకు రప్పించినట్లు తెలుసుకున్నారు. డీలర్ నుంచి ఒక్కో ఇంజక్షన్ రూ.10కి కొనుగోలు చేసి ఇక్కడ రూ.250కి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇప్పటికే వెయ్యిలో 150 ఇంజక్షన్లు విక్రయించేశాడు. ఊర్వశీ జంక్షన్‌కు చెందిన చిన్నగొడవ ప్రసాద్(27), కప్పరాడకు చెందిన పెద్దపూడి రామ్‌ప్రసాద్(26), బర్మా క్యాంప్‌కు చెందిన వాసుపల్లి బాలఅప్పలస్వామి(36), పల్లివెల్ల సంతోష్‌కుమార్(23) ఈ ఇంజక్షన్లు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారించగా.. రూ.250కి కల్యాణ్‌కుమార్ నుంచి కొనుగోలు చేసి వాటిని తిరిగి రూ.350కి కూలి పనులు చేసుకుంటున్న వారికి విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో కల్యాణ్‌తో పాటు ఈ నలుగురిని కూడా అరెస్ట్ చేసి, 850 ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.

గంజాయి రవాణా నియంత్రణకు చెక్‌పోస్టులు

గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు సీపీ తెలిపారు. ఇందుకోసం నగరంలోకి ప్రవేశ మార్గాలైన తగరపువలస, అగనంపూడి సమీపంలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేశామన్నారు. 2014 నుంచి 2019 వరకు 2,900 కేసులే నమోదు కాగా.. 2019 నుంచి ఇప్పటి వరకు 6500 కేసులు పెట్టినట్లు తెలిపారు. అప్పట్లో గంజాయి రవాణా చేస్తున్న 4 వేల మందిని అరెస్ట్ చేయగా, 2019 నుంచి ఇప్పటి వరకు 15,900 మంది అరెస్ట్ చేసినట్లు సీపీ వివరించారు.

ఒకవైపు గంజాయి రవాణా నియంత్రణతో పాటు మరో వైపు వినియోగదారుల్లో పరివర్తన కోసం 'మార్పు'అనే కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. గంజాయి రహిత విశాఖగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) జి.నాగన్న, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు, ఏసీపీ(పశ్చిమ) అన్నెపు నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బ్లూఫ్లాగ్ బీచ్‌కు బృహత్తర ప్రణాళిక



- అంతర్జాతీయ సౌకర్యాలతో అదనపు హంగులు
- రూ.2.50 కోట్లతో మౌలిక సదుపాయాలు
- బీచ్ వాలీబాల్, బీచ్ క్రికెట్ కోర్టులు, అడ్వెంచర్ స్పోర్ట్స్
- దేశంలోని మిగిలిన బ్లూఫ్లాగ్ బీచ్‌ల మాదిరిగా ప్రవేశ రుసుం
- ఈ నెల 11 నుంచి అమలు చేయాలని కమిటీ నిర్ణయం
- ఒక్కొక్కరికి ప్రవేశ టికెట్ రూ.20
- రూ.10 మరుగుదొడ్ల రుసుం రద్దు

రాష్ట్రంలో బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన ఏకైక బీచ్ రుషికొండ.. మరిన్ని హంగులద్దుకునేందుకు ముస్తాబవుతోంది. పర్యాటకులకు సరికొత్త అనుభూతులు అందించేందుకు రూ.2.50 కోట్లతో పర్యాటక శాఖ బృహత్తర ప్రణాళిక సిద్ధం చేసింది. మరోవైపు బీచ్ నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణకు దేశంలోని మిగిలిన బ్లూఫ్లాగ్ బీచ్‌ల మాదిరిగా నామమాత్రపు ప్రవేశ రుసుం వసూలు చేయాలని నిర్ణయించింది. బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ వచ్చిన మొదటి ఏడాదిలోనే అన్ని బీచ్‌ల్లో ఎంట్రన్స్ ఫీజు వసూళ్లు చేస్తున్నారు. కానీ రుషికొండ బీచ్‌లో మాత్రం మూడేళ్ల తర్వాత.. ప్రవేశ రుసం వసూలు చేయాలని నిర్ణయించడం విశేషం. – సాక్షి, విశాఖపట్నం

పరిశుభ్రంగా.. సర్వాంగ సుందరంగా ఉండే బీచ్‌లకు అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చే బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్‌ను రాష్ట్రంలో దక్కించుకున్న మొట్టమొదటి బీచ్ రుషికొండ. ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్(ఎఫ్ఈఈ) అనే డానిష్‌కు చెందిన సంస్థ మూడేళ్లుగా ఈ సర్టిఫికెట్ జారీ చేస్తోంది. ఈ నేపథ్యంలో బీచ్‌కు అదనపు హంగులు అద్దుతూ.. విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షించేలా ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్) ప్రణాళికలు రూపొందించింది. బ్లూ ఫ్లాగ్ ప్రమాణాలకు భంగం కలగకుండా.. పర్యాటకులకు కొత్త బీచ్‌ను పరిచయం చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. 27,400 చ.మీ.విస్తీర్ణంలో రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేపట్టనున్నారు. టెండర్లు ఖరారు అయిన ఆరు నెలల్లోగా కొత్త సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం సౌర విద్యుత్, పర్యావరణ విద్య, బెంచీలు, స్నానం చేయడానికి వీలుగా షవర్స్, బయో టాయిలెట్లు, గ్రే వాటర్ ట్రీట్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, ఆర్వో ప్లాంట్ వంటి సౌకర్యాలు ఉండగా.. కొత్తగా మరిన్ని సౌకర్యాలు తీసుకురానున్నారు. అవేంటంటే..

- పర్యాటకులు నడిచి వెళ్లేందుకు 182 మీ.పొడవుతో 620 చ.మీ విస్తీర్ణంలో ప్రీకాస్ట్ కాంక్రీట్ బ్లాకులతో పాత్‌వే నిర్మించనున్నారు. 3700 చ.మీ విస్తీర్ణంలో పార్కింగ్ డ్రైవ్ వే ఏర్పాటు కానుంది.
- సందర్శకుల రక్షణ కోసం బొల్లార్డ్, బూమ్ బారియర్స్ ఏర్పాటు చేయనున్నారు.
- బీచ్‌ను ఆకతాయిలు అపరిశుభ్రంగా చేయకుండా.. 1620 చ.మీ విస్తీర్ణంలో రక్షణ వలయం ఏర్పాటు చేయనున్నారు.
- 254 చ.మీ విస్తీర్ణంలో బీచ్ చుట్టూ సందర్శకులకు ఆకట్టుకునేలా పెయింటింగ్స్ వేయనున్నారు.
- సాగరతీరంలో ఫుట్‌బాల్, క్రికెట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.
- బీచ్ వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయనున్నారు.

సందర్శకులకు ఉచిత సౌకర్యాలు

కలెక్టర్ డా.మల్లికార్జున చైర్మన్‌గా వ్యవహరించే బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ.. సందర్శకులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, ప్రథమ చికిత్స సదుపాయం, ఫిజికల్ ఫిట్‌నెస్ పరికరాల వినియోగం, చిన్నారుల ఆటస్థలం, స్విమ్మింగ్ జోన్లను పూర్తి ఉచితంగా వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న పార్కింగ్ ఫీజు, స్నానాల గదుల చార్జీలు యథాతథంగానే కొనసాగుతాయి.



రుషికొండ బీచ్ అభివృద్ధికి సంబంధించిన బ్లూప్రింట్

పదేళ్లలోపు చిన్నారులకు ఉచితం

దేశ వ్యాప్తంగా 12 బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ బీచ్‌లున్నాయి. ఈ బీచ్‌ల నిర్వహణకు భారీగా వ్యయం అవుతోంది. అందుకే ప్రతీ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లోకి వచ్చే సందర్శకుల నుంచి ప్రవేశ రుసుంలు వసూలు చేస్తున్నారు. ఒడిశాలోని గోల్డెన్ బీచ్, తమిళనాడులోని కోవలం బీచ్, కేరళలోని కప్పడ్ బీచ్, కర్ణాటకలోని కాసర్కోడ్ బీచ్‌లో ఏడాదిన్నర నుంచే ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. కొన్ని బీచ్‌లు రూ.50 ప్రవేశ టికెట్ వసూలు చేస్తుండగా.. మరికొన్ని బీచ్‌లు రూ.20 వసూలు చేస్తున్నాయి. ఈ ఆదాయంతో బీచ్‌లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆ బీచ్‌ల మాదిరిగానే.. ప్రజలకు మరిన్న సౌకర్యాలు అందించేందుకు రుషికొండ బీచ్‌కు ప్రవేశ రుసుం వసూలు చేయాలని నిర్ణయించారు. బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ వచ్చిన మూడేళ్ల తర్వాత ఈ ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. పెరుగుతున్న పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించేందుకు ఏపీటీడీసీ ఈ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి బ్లూఫ్లాగ్ నియమాల్లో ప్రవేశరుసం కూడా ఉంది. దాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 11 నుంచి ఒక్కొక్కరికీ రూ.20 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. పదేళ్ల లోపు చిన్నారులకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానించింది. ప్రస్తుతం బీచ్‌లో మరుగుదొడ్ల వినియోగానికి రూ.10 వసూలు చేస్తున్నారు. దాన్ని రద్దు చేశారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



రాష్ట్రంలోని ఏకైక బ్లూఫ్లాగ్ బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు కమిటీ పలు నిర్ణయాలు తీసుకుంది. దీనికి అందరూ సహకరించాలి. రుషికొండ బీచ్‌లో గ్రే వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్, ఆర్వో వాటర్‌ప్లాంట్, పరిశుభ్రమైన టాయిలెట్లు, స్నానాల గదులు, సౌర విద్యుత్ ప్లాంట్, పిల్లల ఆట స్థలం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాం. బీచ్ పరిశుభ్రత, సందర్శకుల భద్రత కోసం రూ.6లక్షల వ్యయంతో 39 మంది బీచ్ క్లీనర్లు, సెక్యూరిటీ గార్డులు, లైఫ్ గార్డులను నియమించాం. త్వరలోనే అంతర్జాతీయ సౌకర్యాలు కూడా రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వహణ వ్యయంతో కోసం.. బ్లూఫ్లాగ్ నియమాలను అనుసరించి ఎంట్రన్స్ ఫీజు వసూలు చేయాలన్న బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– శ్రీనివాస్ పాణి, ఏపీటీడీసీ రీజినల్ డైరెక్టర్

జాతీయ పోటీలకు 'ఉక్కు' బాక్సర్లు



క్రీడాకారులను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ విభాగాధిపతి ప్రకాష్

ఉక్కునగరం: జాతీయస్థాయి జూనియర్ మెన్ బాక్సింగ్ పోటీలకు స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు ఎంపికయ్యారు. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 15 వరకు ఇటానగర్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ జట్టుకు చెందిన ఆశిక్ మహమ్మద్, డి.మనోజ్‌లు ఈ పోటీలకు ఎంపికయ్యారు. స్పోర్ట్స్ విభాగంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీరిని స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాష్ అభినందించారు. విభాగం మేనేజర్ అమిత్ ఘుడాయ్, కోచ్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జైలు శిక్ష

విశాఖ లీగల్: ఆదాయానికి మించి ఆస్తి కలిగి ఉన్న పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి మూడేళ్ల జైలుశిక్ష, రూ 2లక్షలు జరిమాన విధిస్తూ నగరంలోని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. ఏసీబీ అధికారులు అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు ఎ.ఎస్. హరి గతంలో పంచాయతీ రాజ్ విభాగంలో ఉద్యోగిగా పనిచేశారు. 1997లో అతనిపై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

వైఎస్సార్ జయంతికి విస్తృతంగా సేవా కార్యక్రమాలు

- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల పిలుపు



మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

సాక్షి, విశాఖపట్నం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, జోనల్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 8.30 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం నియోజకవర్గాల పరిధిలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు, జిల్లా, జోనల్ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలన్నారు. సమావేశంలో పలు కార్పొరేషన్ చైర్మన్‌లు బొల్లవరపు జాన్‌వెస్లీ, చొక్కాకుల లక్ష్మీ వెంకట్రావు, ఆల్ఫా కృష్ణ, కొల్లి సింహాచలం, విశాఖ జోనల్ అనుబంధ ఇన్‌చార్జిలు అల్లంపల్లి రాజాబాబు, బర్కత్ అలీ, తుల్లి చంద్రశేఖర్ యాదవ్, కలిదిండి బద్రినాథ్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు అడ్డాల కృపాజ్యోతి, బోని శివరామకృష్ణ, కె.వి.బాబా, బయ్యవరపు రాధ, మన్యాల శ్రీనివాస్, పెంద్ర అప్పన్న, నమ్మి లక్ష్మణరావు, వానపల్లి ఈశ్వరరావు, తిప్పల వంశీరెడ్డి, చిక్కా సత్యనారాయణ, బోండా ఉమామహేశ్వరరావు, అద్దేపల్లి రవిబాబు, ముఖ్య నాయకులు సత్యల సాగరిక, బాజీ నాయుడు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఏ త్యాగానికైనా సిద్ధం

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఎం ఆరు జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు (విశాఖ), కె.లోకనాథం (అనకాపల్లి), పి.అప్పలనర్స (అల్లూరి జిల్లా), టి.సూర్యనారాయణ (విజయనగరం), డి.వెంకట రమణ (పార్వతీపురం మన్యం) డి.గోవిందరావులు (శ్రీకాకుళం) శుక్రవారం ఉదయం10 గంటల నుంచి శనివారం 10 గంటల వరకు దీక్షకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. విశాఖస్టీల్ ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరుతో వందశాతం అమ్మకానికి పెట్టిందన్నారు. దీనిని నిరసిస్తూ కార్మిక వర్గమంతా 900 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమానికి రంగం సిద్ధం చేస్తామన్నారు. దీక్షకు కార్పొరేటర్ డా.బి.గంగారావు, సీపీఎం విశాఖ కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్ అధ్యక్షత వహించారు. దీక్షకు మాజీ ఎమెల్సీ ఎంవీఎస్ శర్మ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ జార్జ్ విక్టర్, ఉత్తరాంధ్రాభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ, బొడ్డు కల్యాణరావు, ప్రభాకర్‌రావు, బి.వి.రామాంజనేయులు, స్టీల్‌ప్లాంట్ నాయకులు జె.అయోధ్యరామ్, ఎన్.రామ చంద్రరావు, ఐద్వా కార్యదర్శి వై.సత్యవతి పాల్గొన్నారు.

అహ్మదాబాద్‌లో మేయర్ హెరిటేజ్ వాక్



కట్టడాల విశేషాలను తెలుసుకుంటున్న మేయర్

డాబాగార్డెన్స్: మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం అహ్మదాబాద్‌లో జరిగిన హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు. అక్కడ జరుగుతున్న జీ-20 అర్బన్-20 సదస్సుకు ఆమె హాజరైన సంగతి తెలిసిందే. సదస్సులో భాగంగా రెండో రోజు జాతీయ, అంతర్జాతీయ మేయర్లతో కలిసి హెరిటేజ్ వాక్‌లో ఆమె పాల్గొన్నారు. అక్కడ ఏడు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. స్వామి నారాయణ మందిర్(కలుపూర్), కవి దళపత్రం చౌక్, శాంతినాథ్ దేరాసర్, ట్యాంక్షాల్ ని హవేలీ, అష్టపద్ దేరాసర్, హర్‌కుర్వార్ సేతాని మాన్షన్, జామా మసీదు విశేషాలను అక్కడి గైడ్ వారికి వివరించారు. అనంతరం సదస్సులో నగర మేయర్ పాల్గొన్నారు.

కాకినాడలో యువకుడి బ్రెయిన్‌డెడ్

- గ్రీన్ చానల్ ద్వారా విశాఖకు కిడ్నీ



కేర్ ఆస్పత్రికి కిడ్నీని తీసుకువస్తున్న సిబ్బంది

మహారాణిపేట: కాకినాడ నుంచి గ్రీన్ చానల్ ద్వారా గురువారం రాత్రి 11 గంటలకు రామ్‌నగర్ కేర్ ఆస్పత్రికి కిడ్నీ తీసుకొచ్చారు. వివరాలివీ.. కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన మాతా లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ కాగా.. యువకుడి అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆయన గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలను పలు ప్రాంతాల్లో అవయవమార్పిడి కోసం వేచి ఉన్న వారికి జీవన్‌దాన్ ప్రతినిధులు కేటాయించారు. ఈ మేరకు రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రికి కిడ్నీ కేటాయించారు. ఈ నేపథ్యంలో కాకినాడ నుంచి నగరానికి కిడ్నీ తీసుకొచ్చేందుకు సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్, ఏడీసీపీ శ్రీనివాస్ గ్రీన్ చానల్ కారిడార్ ఏర్పాటు చేశారు. 2.25 గంటల వ్యవధిలో కాకినాడ నుంచి ఇక్కడకు కిడ్నీ తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ యంత్రాంగానికి కేర్ పరిపాలనాధికారి వద్దిపర్తి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మీనారాయణ త్యాగం మరువలేనిదని, వారి కుటుంబం ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

రూ.7లక్షల డ్వాక్రా సొమ్ము ఆర్పీ స్వాహా

కొమ్మాది: ఆరు డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.7 లక్షల సొమ్మును జీవీఎంసీ 8వ వార్డుకు చెందిన ఆర్పీ స్వాహా చేశారు. ఆలస్యంగా గుర్తించిన బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎండాడ (బీసీ కాలనీ, ఎస్సీకాలనీ, దుర్గానగర్)లో ఆర్పీగా విధులు నిర్వహిస్తున్న ఇందు ఏడాది నుంచి ఆరు గ్రూపులకు సంబంధించిన సుమారు రూ.7లక్షలను బ్యాంకులో జమ చేయ లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేయగా.. గ్రూపు సభ్యులకు ఆ నిధులు జమ కాలేదు. సందేహం వచ్చి మధురవాడలోని కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఆరా తీశారు. ఏడాది నుంచి అసలు, వడ్డీ కట్టకపోవడంతో ఆసరా సొమ్ము జమ కాలేదని బ్యాంక్ అధికారులు తెలిపారు. దీంతో షాక్‌కు గురైన మహిళలు ఆర్పీ ఇందును నిలదీశారు. బ్యాంకుకు డబ్బులు చెల్లించకపోవడం వాస్తవమే అని, వ్యక్తిగతంగా ఆ సొమ్మును వాడుకున్నట్లు తెలిపింది. తమ సొమ్మును వెంటనే బ్యాంకులో జమ చేయాలని వారంతా హెచ్చరించారు. అయితే ఆమె నుంచి సమాధానం రాకపోవడంతో.. సీవో దీప దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. ఆమె ఉన్నతాధికారులకు ఈ విషయం చెప్పగా.. శుక్రవారం రాత్రి డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారి ప్రసాద్ ఎండాడ వచ్చారు. గ్రూపు సభ్యుల వివరాలు, రికార్డులను తనిఖీ చేశారు. పూర్తి వివరాలు సేకరించి ఆర్పీపై చర్యలు తీసుకుంటామని డీపీవో తెలిపారు.

నేత్రపర్వం.. నృత్యోత్సవం







ఏయూక్యాంపస్: ఏయూలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అసెంబ్లీ మందిరం వేదికగా నిర్వహిస్తున్న నాట్యరవళి సంగీత, నృత్య అకాడమీ మూడు రోజుల నృత్యోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని ఎస్.కె.ఎం.ఎల్ దేవస్థానం పూర్వ చైర్మన్ వంకాలయ తాతాజీ ప్రారంభించారు. తొలి రోజున శాస్త్రీయ, జానపద నృత్య పోటీల్లో 98 మంది కళాకారులు పోటీ పడ్డారు. వేదికపై కళాకారులు తమ నాట్య కౌశలాన్ని ప్రదర్శించి ఆహూతుల అభినందనలు అందుకున్నారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా నటరాజ్ పరమేశ్వరన్, పుమర్తి వెంకట రమణ వ్యవహరించారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు యు.మహేష్ బాబు, అప్లింగ్ ప్రసాద్, బాబు మాస్టారు, పి.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భీమునిపట్నం: భీమిలిలో తీరంలో శుక్రవారం అలలు ముందుకు రావడంతో బీచ్‌రోడ్డులోని గట్టు భారీగా కోతకు గురయ్యింది. బీచ్‌పార్కు నుంచి సమీపంలో మత్స్యకారులు నివసించే బోయివీధి వరకు ఉన్న గట్టు ప్రాంతం కోతకు గురవడంతో మత్స్యకారులు ఆందోళన చెందారు.

ఇండియన్ నేవీ క్విజ్ పోటీలకు ఆహ్వానం

సింథియా: జీ-20 శిఖరాగ్ర వేడుకల్లో భాగంగా 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ది ఇండియన్ నేవీ క్విజ్(థింక్) పేరుతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.అత్యుత్తమ ప్రతిభ ఉన్న భారత జట్టు న్యూఢిల్లీలోని ఇండియా గేట్‌లో జరిగే అంతర్జాతీయ రౌండ్‌లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారు. ఆసక్తి ఉన్న పాఠశాలల విద్యార్థులు https://www.theindiannavy quiz.inలో ఈ నెల 31లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నేవీ అధికారులు కోరారు.